


బాబు ష్యూరిటీ.. బురిడీ గ్యారెంటీ

చంద్రుడు సూర్యుడిలా మండినా.. సూర్యుడు పత్తికాయలా ఎండినా.. మీ అందరికి బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ అంటూ ఊరూవాడా చాటారు. ఎన్నికల ముందు ఇంటింటికి వెళ్లి హామీ పత్రాలు ఇచ్చి మభ్యపెట్టారు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అన్నదాత సుఖీభవ పథకం కింద అందజేస్తాం.. చదువుకునే బిడ్డలకు తల్లికి వందన పేరుతో రూ.15వేలు, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి అవకాశం. ఇలా మేనిఫెస్టోలో ప్రకటించారు. కానీ ఇంత వరకు అతీగతీ లేదు.

వైఎస్ జగన్ హయాంలో..

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి హృదయంలో ఇంద్ర ధనుస్సులు వెలిగించారు. ప్రతి ఇంటా సంక్షేమ ప్రవాహాన్ని కురిపించారు. అమ్మ ఒడి పథకం కింద బిడ్డకు రూ.15 వేలు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందించారు. రైతు సాగు సాయాన్ని రైతు భరోసా పేరుతో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కంటే ముందే ఇచ్చారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అందించి సత్తా చాటారు. ప్రస్తుత ప్రభుత్వం అందుకు భిన్నంగా కాలయాపన చేస్తోంది.

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్




యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు	
నరసరావుపేట	92,000
చిలకలూరిపేట	80,000
వినుకొండ	36,000
నెలకు ఇవ్వాల్సిన సాయం	రూ.62.40 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
రైతు భరోసా	నరసరావుపేట	38.52
	చిలకలూరిపేట	34.66
	వినుకొండ	42.24



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు	
నరసరావుపేట	25,682
చిలకలూరిపేట	27,953
వినుకొండ	31,287



ప్రతి మహిళకు నెలకు రూ.1,500

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు	
నరసరావుపేట	1,16,688
చిలకలూరిపేట	95,000
వినుకొండ	1,27,831

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

పథకం	నియోజవకర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మ ఒడి	నరసరావుపేట	75.75
	చిలకలూరిపేట	34.03
	వినుకొండ	36.78



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు	
నరసరావుపేట	50,501
చిలకలూరిపేట	22,687
వినుకొండ	48,000

తల్లికి వందనం ఊసేది?



మాకు ముగ్గురు కుమార్తెలు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమ్మ ఒడి పథకంలో భాగంగా మా అమ్మాయి అమూల్యాకు అమ్మ ఒడి కింద ప్రతి ఏటా రూ.15 వేలు ప్రభుత్వం ఇచ్చింది. చదువుకు ఉపయోగపడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకంలో కుటుంబంలో ఎంతమంది చదువుకుంటున్న అందరికి ఏటా రూ.15 వేలు అందజేస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా ఇంత వరకు తల్లికి వందనం ఊసేలేదు.

– జోగి శివమ్మ (శావల్యాపురం)

నెల రూ.1,500 ఇవ్వాలి



మేము వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటాం. నా ఇద్దరు పిల్లలు చదువుకుంటున్నారు. ప్రతి మహిళకు నెల 1500 ఇస్తామని ఎన్నికలలో వాగ్దానం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఇవ్వాలి. ఇప్పటికే రెండో నెల గడుస్తోంది. ప్రతి మహిళకు 1500 రూపాయల పథకం గురించి మాట్లాడం లేదు. చంద్రబాబు నాయుడు చెప్పిన విధంగా ఇస్తే ఇంటి ఖర్చులకు కొంచెం ఆసరాగా ఉంటుందని భావిస్తున్నా. త్వరగా పథకం కింద ప్రకటించిన విధంగా డబ్బులు ఇవ్వాలి.

–కె.రమ్య, యడ్లపాడు

నిరుద్యోగ భృతి చెల్లించాలి



ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరిట నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు అవుతున్నా, ఇప్పటి వరకు భృతి విషయంలో అతీగతీ లేదు. ఇచ్చిన హామీ మేరకు వెంటనే నిరుద్యోగ భృతి చెల్లించి మాట నిలుపుకోవాలి. భృతి కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికే ఆలస్యమైంది.

–కొమ్మాలపాటి గోపి, చిలకలూరిపేట

పెట్టుబడి సమయం వచ్చింది.. ఏది సహాయం!



ప్రతిరైతుకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నారు. గత ప్రభుత్వంలో రూ.13,500 ఇస్తామని చెప్పి ప్రతి ఏడు ఇచ్చారు. ఇప్పుడు వీరు కూడా తప్పకుండా ఇవ్వాల్సిందే. వర్షాలు ముమ్మరంగా పడుతున్నాయి. పంటలు వేసే సమయం ఆసన్నమైంది. నారు, ఎరువులు కొనేందుకు కూలీలను పెట్టుకునేందు పెట్టుబడి కావాలి. వాగ్దానం చేసిన మేరకు ఇస్తే సహాయం చేసిన వారు అవుతారు.

షేక్ సైదా, రైతు, విప్పర్ల

మంచి ఫలితాలు సాధించేలా ప్రోత్సహించాలి

డీఈవో వెంకటేశ్వర్లు

నాదెండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచి మంచి ఫలితాలు రాబట్టేందుకు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు చెప్పారు. యడ్లపాడు మండలం, లింగారావు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. అక్కడే జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల హాజరు, ప్రతిరోజూ ఎంతమంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం వినియోగించుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి గదిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల నిర్వహణ, సమన్వయం, పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కేవీ రామిరెడ్డి, పీఎంసీ చైర్మన్ జాన్ సైదులు, ఏఎస్‌వో పద్మారావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ప్రభాకరశర్మ, శైలజ, మేరిశౌరీలు, గ్రామ పెద్దలు నంబూరి శివరామకృష్ణయ్య, తోకల సత్యనారాయణ ఉన్నారు.

'ఎంబీబీఎస్' సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



రొంపిచర్ల : మండలంలో వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ – కాలేజీలో గత విద్యా సంవత్సరంలో బైపీసీ చదివి అనంతరం జరిగిన నీట్ పరీక్షలో ఉత్తీర్ణులై 'ఎంబీబీఎస్' లో సీటు సాధించిన విద్యార్థిని రుద్రపాటి శ్రీనిధికి బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ మాట్లాడుతూ తమ పాఠశాలలో సాధారణ స్థాయి విద్యార్థిని శ్రీనిధి క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర దీక్షతో చదివి ఎంబీబీఎస్ లో సీటు సాధించటం సంతోషంగా ఉందన్నారు. ఎంబీబీఎస్ లో సీటు సాధించిన విద్యార్థిని శ్రీనిధి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహం వలన తాను ఎంబీబీఎస్ లో సీటు సాధించానన్నారు. అనంతరం విద్యార్థిని శ్రీనిధిని అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు.

రేషన్ బియ్యాన్ని పేదలకు అందించాలి

వినుకొండ(నూజెండ్ల): పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న చౌక ధరల బియ్యం అక్రమార్కులకు వరంగా మారిందని వినుకొండ సీపీఐ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని రేషన్ కార్డుదారులకు రేషన్ బియ్యానికి బదులు డబ్బులు ఇస్తాం తీసుకోవాల్సిందేనంటూ గత కొద్ది నెలలుగా రేషన్ కార్డుదారులను డీలర్లు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుండటంతో సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ సురేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం రేషన్ బియ్యం ఇస్తుందా లేక డబ్బులు ఇస్తుందాని ప్రశ్నించారు.

క్లుప్తంగా

సామర్థ్యానికి అనుగుణంగా బోధన చేయాలి

శావల్యాపురం: విద్యార్థుల సామర్థ్యం ఆధారంగా ఉపాధ్యాయుల బోధన తీరు ఉండాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పాఠశాలల సముదాయ సమావేశంలో భాగంగా రెండవ రోజు ముగింపు కార్యక్రమంలో ఎంఈవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మద్దికుంట సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తల్లుల కమిటీలు కూడ ఏర్పాటు చేయాలన్నారు. టీచింగ్ బోర్డు యాప్‌పై ఉపాధ్యాయులు అవగాహన కల్గియుండాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల సముదాయాల చైర్మన్ బోడ్డుపాటి విజయలక్ష్మి, ఎంఈవో-2 పుసులూరి లలితా కుమారి, రిసోర్స్ పర్సన్లు బిళ్ళ రాజారమేష్, డి. రవికుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలో తెనాలి సభను విజయవంతం చేయాలి

చిలకలూరిపేట: చలో తెనాలి సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్‌మాదిగ పిలుపునిచ్చారు. ఈ నెల 21న తెనాలిలో నిర్వహిస్తున్న మాదిగల ఆత్మీయ ఆత్మగౌరవ సమ్మేళనం పోస్టర్లను పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మాదిగల సుదీర్ఘ పోరాటం ఫలితంగా రిజర్వేషన్ వర్గీకరణకు బాటలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ నెల 21న తెనాలి వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిర్వహిస్తున్న సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అద్దంకిబాబుమాదిగ, నాయకులు మహేంద్ర, విజయసాగర్, కె.క్రాంతికుమార్, కిరణ్, కృష్ణా, కిషోర్, పల్లెపోగు చంటి, మేరీ అక్క తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులతో చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం

నాదెండ్ల: నులిపురుగుల బారిన పడ్డ చిన్నారులు అనారోగ్యం పాలౌతారని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎల్.ప్రసాద్‌నాయక్ చెప్పారు. గణపవరం పీహెచ్‌సీ పరిధిలో బుధవారం ఎనిమిది సచివాలయ పరిధిలో చిన్నారులకు డీవార్మింగ్ డే సందర్భంగా నులిపురుగుల నివారణకు ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 3255 మంది చిన్నారులు ఉండగా, 3,015 మందికి మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కవిత అనసూయ, ఎంపీహెచ్ ఈవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తవ్వేసేయ్.. అమ్మేసేయ్!!

- ప్రభుత్వ భూమిలో మట్టి అక్రమ తవ్వకాలు
- దొండపాడులో పరుగులు తీస్తున్న టిప్పర్లు

వినుకొండ(నూజెండ్ల): రూరల్ మండలం దొండపాడు గ్రామంలో ప్రభుత్వ భూమిలో విచ్చలవిడిగా మట్టి తోలకాలు జరుగుతున్నాయి. సుమారు ఆరు రోజులుగా ప్రతి రోజూ రాత్రి పెద్దపెద్ద టిప్పర్లతో వినుకొండ పట్టణంలోని కొన్ని నిర్మాణాల కోసం ఈ మట్టిని తోలుతున్నట్లు సమాచారం. పట్టణానికి చెందిన కొంతమంది రాజకీయ నాయకులు సుమారు రూ.40 లక్షలకు ఈ మట్టిని అమ్ముకున్నట్లు సమాచారం. ఇటీవల వినుకొండ రూరల్ మండలం నీలగంగవరం గ్రామంలోని చెరువులో లక్షల రూపాయల మట్టిని అమ్ముకున్నారు. దీనిపై ఏ అధికారి కూడా చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ మట్టి తోలకాలను ఆపాలని ప్రజలు కోరుతున్నారు.



అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్న అక్రమార్కులు

క్రీడలు పోటీతత్వాన్ని పెంపొందిస్తాయి

చిలకలూరిపేట: క్రీడలు పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్ చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏఎంజీ హైస్కూల్‌లో జిల్లా స్థాయి జోడో పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పైన దృష్టి సారించాలని చెప్పారు. క్రీడలు శారీరక దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయన్నారు. ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిత్వంతో పాటు వివిధ విషయాల్లో నైపుణ్యాలు సాధించాలని తెలిపారు. జోడో వంటి మార్షల్ ఆర్ట్స్‌లో పాల్గొనే విద్యార్థులకు క్రమ శిక్షణ ఎంతో ముఖ్యమని సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కరిముల్లా మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ ఖాశింబుడే, శివరామకృష్ణ, దుర్గా, ఇమానుయేలు రాజు, రాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జూడోలో పోటీ పడుతున్న క్రీడాకారులు

నేటి నుంచి స్కూల్ గేమ్స్

వినుకొండ(నూజెండ్ల): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్ -17, అండర్ -14 బాల, బాలికలకు ఈ నెల 19,20,21 తేదీల్లో మండలస్థాయి ఆటల పోటీలు-సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు వినుకొండ మండల కోఆర్డినేటర్ కె.వి.రమణబాబు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ నందు సెలక్షన్స్ నిర్వహించారు. మరిన్ని వివరాలకు 9642022162ను సంప్రదించాలన్నారు.

నూజెండ్ల మండలంలో...

మండల కేంద్రమైన నూజెండ్లలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ నెల 19,20,21 తేదీల్లో మండల స్థాయిలో గేమ్స్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తెలిపారు. అండర్ -17 బాయ్స్‌కి 17, బాలికలకు 7 ఈవెంట్స్ జరుగుతాయన్నారు. కన్వీనర్‌గా పీఈటీ వెంకటరత్నం వ్యవహరిస్తారన్నారు. గేమ్స్‌లో పాల్గొనే వారికి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడాప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు.

నేటి నుంచి మండల స్థాయి స్కూల్‌గేమ్స్

నరసరావుపేటరూరల్: మండలస్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు, ఎంపికలు ఈనెల 19,20 తేదీలలో ఉప్పలపాడులోని వైవిఎస్ఆర్, వైబిఆర్ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. అండర్-14,17 విభాగాలలో బాల, బాలికలకు ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్,యోగా, అథ్లెటిక్స్‌లో పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. మండలంలోని పాఠశాలల క్రీడాకారులు పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించాలని ఆయన కోరారు.

స్కూల్ గేమ్స్‌కు క్రీడాకారుల ఎంపిక

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 20,21 తేదీలలో అండర్-14, అండర్ - 17 విభాగాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్‌కు క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీయం.సుభానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి స్కూల్ గేమ్స్‌కు సంబంధించి 7 క్రీడాంశాలలో ఆటలు నిర్వహించటం జరుగుతుందన్నారు. క్రీడాకారులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ తదితర ఆటలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సంబంధిత ధృవపత్రాలతో హాజరు కావాలన్నారు.

హామీలిచ్చి.. మాటమార్చటం సిగ్గుచేటు

కూటమి నేతల తీరుపై ఎం.ఐ.ఎం నేత షేక్ మౌలాలి ఆగ్రహం



నరసరావుపేట: గత ఎన్నికల్లో అలివికానీ సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చడం సిగ్గుచేటని ఎం.ఐ.ఎం పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలుచేయడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని చెప్పడం ఊసరవెల్లిని గుర్తుచేస్తోందన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, వక్ఫ్‌బోర్డు స్థలాలని కబ్జా కాకుండా కాపాడుతామని చెప్పి ఇప్పుడు కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి మద్దతూ ఇవ్వడం మైనార్టీలపై సవతి తల్లి ప్రేమని తెలియచేస్తోందన్నారు. కేంద్రంలో కీలకంగా మారిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చుకోవడంలో విఫలమైందన్నారు. అలాగే విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో కూడా కూటమి ప్రభుత్వం విఫలమైందని మౌలాలి అన్నారు.

కూలీలందరికీ ఉపాధి సిబ్బంది పనులు కల్పించాలి

ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: జాతీయ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులు కల్గియున్న వారందరికీ పనులు కల్పించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలో నూతనంగా విధుల్లోకి చేరిన ఉపాధి పథకం క్షేత్రసహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్స్) తమ విధులు బాధ్యతగా నిర్వహించి ఉపాధి కూలీలకు పారదర్శకంగా తమ సేవలను అందించాలన్నారు. గ్రామపంచాయతీల్లో ప్రజలకు అవసరమైన నూతన పనులు గుర్తించి వాటి ద్వారా ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని, ప్రతి కుటుంబంలో వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ఉద్యాన పంటలు సాగు వైపు రైతులు ఆసక్తి చూపాలే ఉపాధి సిబ్బంది కీలకపాత్ర పోషించాలన్నారు. గోకులం షెడ్ల నిర్మాణ పనులు పురోగతి పెంపుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీయం కె.రామారావు, టీఏలు రోజారాణి, సుధాకర్‌రావులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

నరసరావుపేట ఈస్ట్: చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించటం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, జెన్‌పాక్ట్ ఆధ్వర్యంలో బుధవారం కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని హితవు పలికారు. కాగా, జాబ్‌మేళాలో 280 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు మెయిల్ ద్వారా తెలియచేయనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడీ బాలునాయక్, స్కిల్ ప్రతినిధి రామాంజనేయులు, కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, కె.వీ రాఘవులు, ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జనరేటర్ ఆరంభం

నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్‌లోని షాదీఖానాకు ఎంవీ ఫుట్‌వేర్ సంస్థ బహూకరించిన 30 కేవీ జనరేటర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు బుధవారం రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం జనరేటర్ స్విచ్చాన్ చేసి పరీక్షించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, మాజీ కౌన్సిలర్ అబ్దుల్ గఫార్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో పలువురికి బహుమతులు

నరసరావుపేట రూరల్: జిల్లాస్థాయి యోగా పోటీలలో ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థులు పలు బహుమతులు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్ బుధవారం తెలిపారు. జిల్లా యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో కళాశాల విద్యార్థి డి.ఉష రిథమిక్ యోగాసన విభాగంలో ప్రథమస్థానం, ట్రేడీషియన్ యోగాసన విభాగంలో ద్వితీయ స్థానం, బి.శ్రీదీప్తి రిథమిక విభాగంలో ప్రథమ స్థానం, ట్రేడిషనల్ విభాగంలో మూడవస్థానం సాధించినట్టు తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి, అకడమిక్ డీన్ డాక్టర్ ఎం.లక్ష్మీ సురేఖ, విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.